# నిండు మనసు

"నేనీ పెళ్ళిచేసుకోను మమ్మీ!"

"ఎందుకు చేసుకోవు? కుర్రాడు బ్యాంకు ఆఫీసరు! చక్కగా వుంటాడు. కట్నం కూడా అక్కర్లేదుట!"

"నువ్వెన్ని చెప్పు. నేను అభిని తప్ప మరెవర్నీ చేసుకోను." ఖచ్చితంగా చెప్పింది పూజ.

"ఎవడా అభి?"

"నా కాలేజీ మేట్. చాలా మంచాయన. మా యిద్దరికీ మూడేళ్ళబట్టి పరిచయం వుంది. అతన్ని తప్ప వేరొకర్ని భర్తగా వూహించుకోలేను."

లలిత, కూతురిమీద గట్టిగా విరుచుకు పడింది.

"నీకేం తెలీదు. మగాళ్లంతా మాయగాళ్లు. ప్రేమపేరు చెప్పి మోసం చేస్తారు! మగాళ్లని అస్సలు నమ్మకూడదమ్మా. నేను చెప్పిన సంబంధమే నువ్వు చేసుకోవాలి!"

"అందరూ అలా ఎందుకుంటారమ్మా? నాన్నగారు చాలా మంచివారు కదా. మగాళ్లలో కూడా మంచివాళ్లు చాలా మంది ఉంటారు!"

"అదంతా నాకనవసరం, నేను చెప్పిన సంబంధం నువ్వు చేసుకోకపోతే నేను వెంటనే వురిపోసుకు ఛస్తాను." బెదిరించింది లలిత.

రాంబాబు చాటునుండి అంతా వింటున్నాడు. నవ్వుకున్నాడు. "లలితది స్వానుభవం మరి! అందుకే అంతలా భయపడుతున్నది!"

లలిత తన స్వంతం అనుకుందికి, పూజ తన కూతురు అనుకుందికి ఎందుకనో అతని అంతరాత్మ ఎదురు తిరుగుతున్నాది. కాని పరువుకోసం, సమాజంలో నలుగురి ముందూ... తలెత్తుకు తిరగడం కోసం విషాన్ని మింగుతున్నాడు. ఇదే మరో మగాడయితే పరిస్థితి మరోలా ఉండేది!

అమ్మ చెప్పినట్టు తను నిజంగా వెర్రినాగన్నే! అందుకే కిమ్మనకుండా లలితతో కాపురం చేస్తున్నాడు...

ఇంకా తల్లీ కూతుళ్ల మధ్య గొడవ తగ్గలేదు.

"నీకు మొండితనం ఎక్కువైంది. ఎలా చేసుకోవో చూస్తాను. నేను చూసిన సంబంధం చేసుకుని తీరాలి నువ్వు. లేకపోతే నేను అన్నంతపనీ చేస్తాను. నీకింకా తెలీదు నా సంగతి! మొండితనంలో నీకు తల్లిని నేను."

"ప్రతీ తల్లీ వల్లించేపాఠమే నువ్వూ వల్లిస్తున్నావు!" నిర్లక్ష్యంగా అంది పూజ. "ఇంట్లో పెద్దవాళ్లు సంబంధం చూసి పెళ్లి చేసుకోమంటే ప్రతీ ఆడపిల్లా నీలాగే అంటుంది మరి!" మాటకు మాట

విసిరింది లలిత.

"మమ్మీ! నీకు ప్రేమంటే ఏమిటో తెలీదు. అందుకే అలా ఎగురుతున్నావు. అవునూ, నువ్వు ఎప్పుడూ ఎవర్నీ ప్రేమించలేదా?!"

లలిత ఒక్క క్షణం తడబడింది. ఆమె ముఖం పాలిపోయింది. వెంటనే తేరుకుని, "మా కాలంలో యిలాంటి ప్రేమలు లేవు" అంది బింకంగా.

లలిత అబద్ధం చెప్తూంటే రాంబాబు మనసు బాధగా నవ్వుకుంది.

"మమ్మీ! అన్నానికీ ఆకలికీ కాలంతో సంబంధం లేదు. ప్రేమకూడా అంతే!..."

"నువ్వెన్ని చెప్పు. నువ్వు ఆ కులం-గోత్రం లేనివాడెవడినో పెళ్లి చేసుకుంటానంటే నేను తక్షణం ఛస్తాను. నా చావుకి నువ్వే కారణం అని రాసిపెట్టి మరీఛస్తాను." కోపంగా అరిచింది లలిత.

లలితకి అంతకోపం రావడం ఎప్పుడూ చూడలేదు రాంబాబు. అయినా అది తనకు సంబంధించిన విషయమే కానట్టు మౌనంగా వుండిపోయాడు.

తల్లి అడుగుజాడల్లో కూతురు నడుస్తున్నాదా?!... తమాషా అయిన ఆలోచనవచ్చి నవ్వుకున్నాడు అతను. అతని ఆలోచనలు గతంలోకి వెళ్లాయి!...

★ ★ ★

ఉదయం ఏడు గంటల మూడు నిముషాలకి ముహూర్తం. సరిగ్గా ముహూర్తం టైంకి జీలకర్ర, బెల్లం పెట్టడం జరిగిపోయింది. తర్వాత మంగళసూత్రధారణ, నాగవల్లి, తలంబ్రాలు, వగైరా పెళ్లితంతులన్నీ చకచకాపూర్తయ్యాయి. ఆఖరికి వధూవరులిద్దరికీ మంగళహారతినిచ్చి పీటలమీంచి లేవమన్నారు. పెద్దలందరి కాళ్లకీ వంగి వంగి దణ్ణాలు పెట్టేసర్కి, వధూవరులిద్దరికీ నడుంలు పట్టేసినట్టయింది. అప్పటికే వచ్చిన స్నేహితులు, తెలిసిన వాళ్లు చాలామంది భోజనాలు చేసి వెళ్లిపోయారు. బంధువులు మిగిలారు.

పెళ్లికొడుకి, పెళ్లికూతురికి రెండు వెండి కంచాలు వేసారు. వాళ్లిద్దరూ వచ్చి కూర్చున్నారు.

"వదినా! వీళ్ల భూజంబంతి చూడ్డానికి అందరం సిద్ధంగా ఉన్నాం. వీళ్లచేత భూజంబంతి చేయించు." వరలక్ష్మి అంటి పెళ్లికొడుకు తల్లిని వుద్దేశించి. కాత్యాయని నవ్వింది.

"రాంబాబూ! వింటున్నావా! నువ్వు లడ్డూ కొరికి మిగిలిన ముక్క ఆ అమ్మాయి నోట్లోపెట్టు. లలితా! నువ్వు కూడా ఒక బూరె కొరికి మిగతాది వాడినోట్లో పెట్టమ్మా. అందరూ చూస్తార్త!"

అన్ని జతల కళ్లూ తమవైపే చూడ్డంతో లలిత బోలెడు సిగ్గుపడిపోయింది. అయినా అదొక వేడుక. పెళ్లిళ్లలో అలాంటి చిన్నచిన్న సరదాలు, వేడుకలు చాలానే వుంటాయి.

రాంబాబు కంయ్యిమన్నాడు.

"అమ్మా! నావి పుచ్చిపళ్ళని నీకు తెల్సుకదా. లడ్డూ కొరికి ఎంగిలి చేసి ఆ అమ్మాయి నోట్లో పెడితే ఏం బావుంటుందే?!" గట్టిగా అరిచాడు.

అక్కడున్న అందరూ గొల్లున నవ్వారు.

కాత్యాయనికి సిగ్గనిపించింది. వాడు ఎప్పుడూ యింతే. ఏ మాట ఎప్పుడు అనాలో, ఎక్కడ ఎలా మాట్లాడాలో వాడికి బొత్తిగా తెలీదు; మనసు మంచిదే కాని బొత్తిగా నోట్లో వేలుపెడితే కొరకలేని వెర్రినాగన్నవాడు;

కొడుకు దగ్గరగావచ్చి నవ్వు ముఖం పెట్టుకుని అందరివైపు చూస్తూనే మెల్లగా రాంబాబు చెవిలో గొణిగింది.

"నేను చెప్పింది చెయ్యరా. అందరూ యిటే చూస్తున్నారు. బావుండదు". మొత్తం మీద భూజంబంతి కార్యక్రమం పూర్తయింది.

భోజనం పూర్తయిన వెంటనే లలిత లేచివెళ్లి భళ్లున వాంతిచేసుకుంది. అది చూసిన రాంబాబు తల్లిమీద ఎగిరాడు.

"నేను చెప్పలేదూ... నావి పుచ్చిపళ్ళని!... అందుకే పాపం లలిత..." కాత్యాయని గబగబా వచ్చి ఏదోచెప్పి కొడుకు నోరు మూయించింది.

"ఉదయంనుంచీ ఖాళీకడుపుతో వుంది కదా. ఒక్కసారిగా తినేసరికి వాంతి అయిపోయి వుంటుంది." లలిత తల్లి అరుంధతి అంటున్నాది!.....

రాంబాబు బి.కామ్. పాసయి, విశాఖపట్నంలోని గాజువాకలో ఒక ప్రయివేట్ కంపెనీలో జాబ్ చేస్తున్నాడు. అక్కడికి దగ్గరగా అద్దెయిల్లు తీసుకుని తల్లితో వుంటున్నాడు. ఉద్యోగ నిర్వహణలో ఏ లోపం లేదు, కాని కొంచెం అమాయకుడు, బోళామనిషి. ఎక్కడ ఎవరితో ఎలా మాట్లాడాలో తెలీదు!

కాత్యాయినికి కోడలంటే ప్రాణం. లలిత కశింకోట దగ్గరున్న వెదురుపర్తి అనే పల్లెటూరు నించి వచ్చింది. అట్టే చదువుకోలేదు. పాపం ఆ అమ్మాయికి బొత్తిగా ఏమీ తెలీదని కాత్యాయని కోడలికి ఏపనీ చెప్పకుండా అన్ని పన్లూ తనే చేసుకునేది. అయితే లలిత వూరికే కూర్చోకుండా అత్తగారికి అన్ని పనుల్లో సహాయం చేసేది. లలిత రోజూ ఏదో ఒక టైముకు వాంతి చేసుకోవడం చూసి కాత్యాయని ఒకరోజు అడిగింది. "అమ్మా, లలితా! కడుపులో బాగులేదా! తిన్నది అరగలేదులా వుంది. డాక్టరు దగ్గరకి కెళ్దాం పద."

"అక్కర్లేదు అత్తయ్యా! వాంతులు అవే తగ్గిపోతాయి." అంది లలిత నిబ్బరంగా. అలాగే మరో పదిహేను రోజులకి వాంతులు తగ్గిపోయాయి!

నెలరోజులు గడిచిపోయాయి. లలితకి వంట్లో నలతగా ఉండి ఈ మధ్య ఎప్పుడూ పడుకునే ఉంటున్నాది. కాత్యాయని కోడల్ని, వద్దన్నా వినకుండా డాక్టరు దగ్గరకు తీసుకువెళ్లింది. డాక్టరు చెప్పింది విని ఆమె చాలా సంతోషించింది. "వెర్రి నాగన్న! ఏమో అనుకున్నాను. వాడూ ఒక బిడ్డకి తండ్రి కాబోతున్నాడు!" కొడుకుని తల్చుకుని మనసులోనే హాయిగా నవ్వుకుంది ఆమె!

లలితని మంచం దిగనివ్వలేదు కాత్యాయిని. కోడల్ని కూర్చోపెట్టి అన్ని సపర్యలూ చెయ్యడం మొదలుపెట్టింది. కాత్యాయిని లెక్కల ప్రకారం కోడలికి యిప్పుడు అయిదవ నెల! కాని ఆ అమ్మాయి కడుపు అంత ఎత్తుగా ఉందేమిటి?" మనసులోనే ఆశ్చర్య పోయింది.

"ఆఁ దానికేముంది. కొంతమందికి కడుపు మరీ పెద్దదిగా కనిపిస్తుంది" అని తనకి తానే సర్ది చెప్పుకుంది. ఒకరోజు లలిత కడుపులో నొప్పి రావడంతో విల విల్లాడిపోయింది. కాత్యాయిని కంగారు పడింది. ఆ రోజు సాయంత్రం నుండి జోరుగా వర్షం కురుస్తున్నాది. రోడ్లన్నీ బురదగా ఉన్నాయి. కరెంటు కూడా లేదు. లలిత నొప్పితో బాధపడి పోతున్నాది.

కాత్యాయినికి మనసులో ఏ మూలో చిన్న అనుమానం పొడసూపింది.

"లలితా! నీకిప్పుడు ఎన్నో నెల?" నిలదీసి అడిగింది కోడల్ని.

లలిత బిత్తర చూపులు చూసింది.

"ఫర్వాలేదు. చెప్పు"

"ఎనిమిది నెలలు నిండిపోయాయి." అంది నెమ్మదిగా.

కాత్యాయినికి పక్కలో బాంబు పడినట్టుగా అయింది.

ఇదంతా తన కొడుకు నిర్వాకం అని యిన్నాళ్లూ మురిసిపోయింది. ఇప్పుడు అసలు సంగతి తెలియగానే ఆమెకి ఏం చెయ్యాలో తోచలేదు.

"ఎంతపని చేసావు లలితా! అంటే పెళ్లికి ముందే...!?"

అత్తగారి ముఖంలోకి చూడలేక తల దించుకుంది లలిత.

"మీ ఇంట్లో వాళ్లకి తెలుసా ఈ విషయం?" కొంచెం కోపంగానే అడిగింది.

"తెలీదు. తెలిస్తే అమ్మ చంపేస్తుంది!!"

అంతవరకు అణుచుకున్న దుఃఖం అంతా ఆమెకు ఉప్పెనలా ముంచుకొచ్చింది. అమాంతం అత్తగారి కాళ్లని చుట్టేసింది లలిత!

"మీరే... నన్ను రక్షించాలి. మీ మంచితనం, విశాల హృదయం గురించి విన్నాను. పెళ్లయి వచ్చాక స్వయంగా తెలుసుకున్నాను. మీరు నన్ను కడుపులో పెట్టుకుని కాపాడకపోతే నాకు మరణం తప్ప మరో మార్గం లేదు". లలిత వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టింది.

కాత్యాయిని బాగా ఆలోచించింది. తన కూతురే అలాంటి పని చేస్తే తనేం చేస్తుంది? ఏమో. తనకి కూతురు లేదు. ఆ సంగతి తానెలా చెప్పగలదు! ఉన్నది ఒక్కగానొక్క కొడుకు! పట్నం పిల్లలు చాలా ఫాస్ట్ అని... భర్తలని బుట్టలో వేసేసు కుంటారని వింది తను. పల్లెటూరినుండి వచ్చిన పిల్ల... చదువుకోలేదు. లోకం అంటే ఏమిటో తెలియని అమాయకురాలు... అనుకుంది కాత్యాయిని. కాని తన అంచనా తప్పయింది.

ఆమె మనసులో రకరకాల ఆలోచనలు కందిరీగల్లా చుట్టుముట్టాయి.

"ఈ అమ్మాయిని యిప్పుడు కొప్పడి వదిలించుకుంటే ఏమవుతుంది? ఆ పిల్ల ఏ నుయ్యో-గొయ్యో చూసుకుంటే పరువు నష్టం తన కుటుంబానికే! కడుపుతో ఉన్న పిల్లని... నొప్పులు పడుతున్న పిల్లని... చూస్తూ చూస్తూ ఎలా వదిలేస్తాం? మగాడివల్ల మోసపోయిన అమ్మాయిని చేరదీసి కాపాడానన్న తృప్తి తన మనసుకి కలగదా! ఎలాగూ అయిందేదో అయిపోయింది. మోసపోవడం

నేరం కాదు. చెడ్డతనం కాదు. ఆమె తెలిసి ఆ తప్పు చెయ్యలేదు. "ఇతరుల్ని నమ్మడం" అన్నది అజ్ఞానంవల్ల, అమాయ కత్వంవల్ల కూడా జరుగుతుంది! మనం అమాయకంగా ఎదుటివాళ్లని నమ్మితేనే కదా, వాళ్లు మనల్ని మోసం చేసేది?!... ఆ పిల్లని యిలాంటి పరిస్థితుల్లో... లేదా తర్వాతైనా వెళ్లిపొమ్మని చెప్పడం మానవత్వం అనిపించుకోదేమో?!... ఏమిటో... తన స్థానంలో మరొక ఆడది ఉంటే ఏం చేస్తుంది?!

వెంటనే జరిగిన విషయమంతా తన కొడుక్కి చెప్పేస్తుంది! కోడల్ని తీసుకెళ్లి వాళ్ల పుట్టింట్లో దిగపెట్టేస్తుంది! లేదంటే కోడల్ని అవతలకి గెంటేసి తలుపు వేసేసుకుంటుంది. లేకపోతే ఆమె పుట్టింటివాళ్లని పిలిపించి గుట్టు రట్టు చేసి ఆ పిల్లని తక్షణం తీసుకెళ్లి పొమ్మంటుంది!

కాని కాత్యాయని అందరు అత్తల్లాంటిది కాదు. ఆమె మనసులో ఎవరికీ అన్యాయం చేసే ఆలోచనలు రావు.

అసలు 'అన్యాయం' ఎవరు ఎవరికి చేసారు? లలితే అసలు విషయం దాచిపెట్టి అమాయకుడైన భర్తకి అన్యాయం చేసింది!!

కాత్యాయినికి లలితమీద కోపం వచ్చింది. కాని మరొకవైపు ఆమె పరిస్థితుల దృష్ట్యా ఆలోచిస్తే ఆ అమ్మాయి మీద జాలి కలిగింది.

కాత్యాయినికి ఆలోచనలతో తల బ్రద్దలైపోతోంది...

రాంబాబు వూర్లో లేడు. ఆఫీసు మీద అనకాపల్లి వెళ్లాడు. కాత్యాయిని పక్కింటి వాళ్ళబ్బాయికి చెప్పి ఆటో తెప్పించింది. బయట వర్షం కుండపోతగా కురుస్తున్నాది. కోడల్ని హాస్పిటల్లో జాయిన్ చేసింది. గంటసేపు నొప్పులు పడ్డాక ఆడపిల్ల పుట్టింది లలితకి!

నర్సువచ్చి చెప్పింది "మీకు మనవరాలు పుట్టింది. వెళ్లి చూడండి," అని.

కాత్యాయిని మనసు తుఫానులో చిక్కుకున్న నావలా తయారయింది. ముందు గొయ్యి, వెనక నుయ్యి: అన్నట్టుగా వుంది ఆమె పరిస్థితి!!

అయినా మనసుని గట్టి చేసుకుని లోపలికి నడిచింది.

లలిత నిశ్శబ్దంగా ఏడుస్తున్నాది!

తలమీద మెత్తటి చేతి స్పర్శకి లలిత తలెత్తి చూసింది.

ఎదురుగా... తనని రక్షించడానికి వచ్చిన దేవతలా... అత్తయ్య!

ఆమె దుఃఖం ఉధృతమైంది.

ఆమెని ఓదార్చి బిడ్డను చేతిలోకి తీసుకుని ముద్దాడింది.

లలిత కృతజ్ఞతగా రెండు చేతులూ జోడించి నమస్కారం చేసింది.

... రాంబాబు "అమ్మా! మా పెళ్లయి ఆరు నెలలే కదా అయింది!? నవమాసాలు మొయ్యడం అంటారు!"

లలిత గుండెలో రాయి పడింది. అత్తగారి వైపు చూసింది. ఆవిడ నవ్వేస్తూ "పోరా! నీవన్నీ

తప్పుడు లెక్కలు! అయినా పాప నెలలు నిండకుండానే పుట్టేసింది. ఏడవ నెల రాగానే పుట్టింది. నెలలు తక్కువ పిల్ల!'' అలా అనేసింది కాని ఆవిడకి గరళం మింగుతున్నట్టుగా అనిపించింది...

కాత్యాయిని ఒకరోజు గుండెపోటు వచ్చి కన్నుమూసింది. కన్నతల్లి కన్నా ఎక్కువగా తనని కడుపులో పెట్టుకుని కాపాడిన అత్తయ్యగారు పోవడంతో లలిత బాగా కృంగిపోయింది. ఏ జన్మలో తను చేసుకున్న అదృష్టమో అంత మంచి భర్త... అత్త తనకి దొరికారు! ఎప్పటికప్పుడు తన విషయం భర్తకి చెప్పి క్షమించమని అడుగుదాం అనుకుంటుంది. కాని కూతురి భవిష్యత్, తన భవిష్యత్ తల్చుకుని నోరు మెదపకుండా వూరుకుంటు న్నాది!...

అలా పది సంవత్సరాలు గడిచిపోయాయి. రాంబాబుకి పిల్లలంటే చాలా యిష్టం. మరీ ఒక్కర్తే కూతురు అయిపోయింది. మరొక పిల్లో, పిల్లాడో పుడితే బాగుండునని అతని మనసులో వుంది. ఒకరోజు డాక్టరు దగ్గరకు వెళ్లాడు రాంబాబు. తనకి పదేళ్ల క్రితం ఒక ఆడపిల్ల పుట్టిందని, ఆ తర్వాత మరి పిల్లలు పుట్టలేదని మరో పాపో, బాబో పుట్టాలంటే ఏం చెయ్యాలని అడిగాడు డాక్టర్ని. డాక్టరు రాంబాబుకి టెస్టులన్నీ చేసాక అతని ముఖంలోకి అదోలా చూసాడు.

"ఏమయింది డాక్టరుగారు? ఎందుకలా చూస్తున్నారు?'' ఆత్రుతగా అడిగాడు.

"సారీ! మీకు సంతానయోగం లేదు. మీకసలు పిల్లలు పుట్టే అవకాశమే లేదు! అయామ్ వెరీ సారీ!'' అన్నాడు డాక్టరు. రాంబాబు తెల్లబోయాడు.

"అదేంటి అలా అంటున్నారు! మరి నాకు... పదేళ్ల పాప...''

"అదే నాకూ అర్థం కావడంలేదు. ఈ జన్మకి మీకు పిల్లలు పుట్టే ఛాన్సు లేదు.''

అప్పుడు రాంబాబుకి కొంచెం కొంచెంగా అర్థమవసాగింది!

పాప పుట్టగానే... తల్లి అన్న మాటలు... గుర్తుకొచ్చాయి!

అయితే ఆ పాప!... రాంబాబు మరి ఆలోచించలేకపోయాడు. అతనికి నీరసం- నిస్సత్తువ ఆవహించాయి! రాంబాబు ఇప్పుడు పూర్వం రాంబాబు కాదు. అనుభవాలు నేర్పిన పాఠాలు యిప్పుడిప్పుడే అతని మెదడుకి పదును పెట్టసాగాయి. మనుషులు- వాళ్ల మనస్తత్వాలు అర్థం చేసుకుంటున్నాడు.

భార్యని ఏమీ అనలేదు. ఆమె 'గతం' తవ్వడానికి ప్రయత్నించలేదు. జీవితంతో రాజీపడిపోయి బ్రతకడానికే నిశ్చయించుకున్నాడు.

కాని ఈనాడు పూజ ఎవరినో ప్రేమించానని చెప్పి తల్లిదండ్రులకి ఎదురు తిరిగింది!...

★ ★ ★

ఆలోచనల్లోంచి బయట పడ్డాడు రాంబాబు. లేచి తన గదిలోకి వెళ్లిపోయాడు...

పూజ అభిని మనస్ఫూర్తిగా ప్రేమించింది. తన సర్వస్వం అర్పించింది. అభిమీద, జీవితంమీద పూర్తి నమ్మకంతో వుంది పూజ, కాని పరిస్థితులు ఎదురు తిరిగాయి. అడ్డంకులు అమ్మ రూపంలో ఏర్పడ్డాయి! బంధానికి బెదిరింపులు మొదలయ్యాయి! ఒకర్ని ప్రేమించి, మరొకర్ని పెళ్లి చేసుకోవడం

తనవల్ల కాదు. ఆ విషయం తల్లితో స్పష్టంగా చెప్పేసింది. కాని తనకి తెలియకుండా తను యింట్లో ఉన్న సమయంతో, అందంగా ప్లాన్ వేసి పెళ్లిచూపుల ఏర్పాటు చేసేసింది తన తల్లి. పూజకిది విషమ పరిస్థితి! అయినా ధైర్యంగా పెళ్లిచూపుల్లో అబ్బాయి ఎదురుగా కూర్చుంది. ఆ అబ్బాయితో పర్సనల్‌గా మాట్లాడాలని అంది. లలితకు కంగారు ఎక్కువైంది. అడ్డుపడదామని చూసింది. కాని "ఈ కాలం పిల్లలు ఒకళ్ల అభిప్రాయాలు మరొకరు తెల్సుకోడం మంచిదే కదా. వాళ్లని మాట్లాడుకోనివ్వండి". అని పెళ్లికొడుకు తల్లి అనేసర్కి, లలిత ముఖం చిన్నబుచ్చుకుంది.

పూజ ఆ అబ్బాయిని లోపలికి తీసుకెళ్లి తనకీ- అభికి మధ్యనున్న ప్రేమ వ్యవహారమంతా పూస గుచ్చినట్లుగా చెప్పేసింది. ఆ సంబంధం తప్పిపోయింది.

"ఇది కాకపోతే మరొక సంబంధం చూస్తాను. ఎలాగైనా నాకు నచ్చినవాడినిచ్చి నీకు పెళ్లి చేస్తాను."

"నీకు నచ్చినవాడా..! నీకు నచ్చితే నువ్వే చేసుకో. నాకు చెప్పకు". విసుగ్గా అనేసి వెళ్లిపోయింది పూజ.

ఇహ లాభంలేదని పూజ, అభిని గుళ్లో పెళ్లి చేసుకుంది. రిజిస్ట్రార్ ఆఫీసులో దండలు మార్చుకుని, సంతకాలు చేసి పెళ్లి చేసుకున్నారు వాళ్లిద్దరూ. పూజ, అభిలు ఈ తరం యువతకి ప్రతినిధులు.

పూజ లలిత కాదు, పరిస్థితులకి తలవంచడానికి!!

కొత్త తరానికొవల్సిన గుండెధైర్యం, తెగింపు ఆమెలో పుష్కలంగా ఉన్నాయి!

రాంబాబు వధూవరులిద్దర్నీ నిండు మనస్సుతో దీవించాడు!

★ ★ ★

*(అముద్రితం)*